125128801

అల్లాయంచు మహమ్మదీయులు జహోవా యంచు సత్క్రైస్తవుల్
పుల్లాబ్జాక్షు డటంచు వైష్ణవులు శంభుండటంచు శైవుల్ సదా
ఉల్లాసంబున గొల్వనెల్లరను నాయుష్యోగ భాగ్యాదిసం
పల్లాభంబు లొసంగి బ్రోచు పరమాత్ముండొక్కడే చూడుడీ.

భావసంశుద్ధి కల్గుటే భక్తి యగును
పుణ్యకార్యాలు చేయుటే పూజ లగును
పరుల కుపకార మొసగుటే తపసు యగును
మరువబోకుడిటువంటి మంచిమాట.

ప్రేమస్వరూపులారా!

ప్రపంచములో ప్రతి కణములోను, జీవితములోని ప్రతి క్షణములోను దేహమునందలి ప్రతి అణువులోను నిరంతరము, అడుగడుగునకును సాక్షాత్కరింపజేయునది ఆత్మతత్వమే. మానవునకు మరొక పేరు మనస్సు. మనసు కలవాడే మానవుడు మనసే లేకున్న మనిషే కాడు. అయితే యిట్టి మనసు యొక్క తత్వాన్ని గుర్తించుటయే మానవుని ప్రధానమైన లక్ష్యము. రసవర్ధకమైన సకల కళా బీజాల భూతమే మనస్సు. ఇది జీవునకే ఆసనము. ప్రేమ తత్వమునకు సింహాసనము. సమస్త కష్టములకు మనసే కారణము. మనస్సును పవిత్రమైన భావములతో నింపినప్పుడే మనిషి కాగలడు.

మానవుని యొక్క పరమ లక్ష్యమేమిటని, గమ్యమేమిటని, పరమార్థమేమిటని ఎవరికి వారు విచారణ సలుపుతూ వుంటారు. ఈ మానవత అనే పదము నందే యితని యొక్క గమ్యము, యితని యొక్క లక్ష్యము, యితని యొక్క పరమావధి యిమిడి వుంటున్నది. మా- అజ్ఞానము, న- లేకుండా, వ- వర్తించుటవు. అజ్ఞానము లేకుండా వర్తించేవాడే మానవ అనే పదమునకు అర్థము. అయితే అజ్ఞానమనగా ఏమిటి? దేహమే నేనని భ్రమించి, దేహమునే వరించి, దేహమునే ప్రధానమైన లక్ష్యము నందు వుంచుకోటమే అజ్ఞానము, దీనికి విరుద్ధమైన మార్గములో దేహాని నేను, దేహతత్వమే నాది దేహం యొక్క లక్ష్యమే నా యొక్క గమ్యము అని విశ్వసించటమే జ్ఞానము. దేహధరించిన రూపమే దేహము. ఈ దేహము కేవలము వస్త్రము మాత్రమే. వస్త్రము తాను కాదుకదా ఈ వస్త్రమును ధరించినవాడే తాను, ఈ దేహమే నేనని భ్రమించటము చేత మమత్వము, అహంకారము, ఆడంబరము యీవిధమైన అసభ్యమైన గుణములకు గురౌతున్నాడు మానవుడు. కనుకనే అనేక జన్మలనుండి యీ యొక్క మమత్వము అహంకారము తనలో గాఢముగా చేరిపోటం చేత మానవుడు తన దివ్యత్వమును గుర్తించుకో

125128802

లేకపోతున్నాడు. ఈ దుర్గుణముల చేతను, దురాలోచనల చేతను, మమత్వ అహంకారముల చేతను తన యొక్క దివ్యస్వరూపాన్ని తెలుసుకోలేక పోతున్నాడు. ఈ కరుడు కట్టుకొని వున్న యీ మమత్వము సులభముగా మనకు పరిశుద్ధము చేయుటకు సాధ్యము కాదు. ఇది జపముల చేత గాని, తపముల చేత గాని, ధ్యానముల చేత గాని, భజనల చేత గాని, యే విధమైన కర్మల చేత మాలిన్యము దూరమయ్యేది కాదు. ఇవి కేవలము ప్రేమకు కొన్ని వుపాంగములు మాత్రమే గాని, నిజమైన ఆధారము ప్రేమయే. అంగముల చేత యేవిధములైన కార్యములైనా సాధించవచ్చుగాని, అమృతత్వమును మనము సాధించుటకు సాధ్యము కాదు. ఐతే యీ అంగములు సత్కర్మలాచరించి, సత్ప్రవర్తనలో ప్రవేశించి, సత్య మార్గమును అవలంబించటమే దీనికి సరైన లక్ష్యము. తుకారాం చెప్పాడు రామా! నేను హీనుడను, అంగహీనుడను, దీనుడను అన్నాడు. అదగా యితను అంగహీనుడు కాదు. సర్వాంగములు వుండినప్పటికి తాను దీనుడను అంగహీనుడను అని అనుటలో ఒక అంతరార్థము వుంది. సేవ చేయని యీ అంగములు కేవలము హీనమైనవి. మంచి కార్యములు చేయని యీ అంగములు కేవలము లేని వాటితో సమానము. నాకు కన్నులున్నవిగాని నిన్ను చూడలేక పోతున్నాను. కనుక నేను కన్నులుండి గ్రుడ్డివాడనే గాని నీను దృష్టిలో కూడినవాడను కాను. చెవులుండి చెవిటివాడనైపోయాను గాని నీ యొక్క మధురమైన వాక్కును వినలేక పోతున్నాను కనుక చెవిటివాడనే. హస్తములున్నవి కాని నీ యొక్క సేవలో యివి ప్రవేశపెట్టలేక పోతున్నాను. కనుక నేను హస్తములుండి కూడను అంగహీనుడనే. నాలుక వున్నది ప్రయోజనమేమిటి? కప్ప నాలుక వలె కదలుచున్నది గాని నీ నామ చింతన నాలుకపై నాట్యమాడించలేక పోతున్నాను. కనుక నాలుక వుండి కూడను నాలుక లేనివాడనే. ఇలాంటి మానవ జీవితమందు సమస్త అంగములు కూడను సత్కర్మలలో ప్రవేశపెట్టి సచ్చింతనలో ప్రవేశపెట్టి సార్థకమును గావించుకోటానికి యిదొక ఉపమార్గముగా ప్రవేశపెట్టింది.

కాని మానవత్వములో రెండు విధములైన లక్షణములు వుంటున్నాయి. తనను తాను మంచిగను, గుణవంతుడిగను, తెలివి తేటలు కలవానిగను విచారించుకొని భ్రమించటము యిది ఒక విధమైన సామాన్య లక్షణము, ఎదుటి వాని యందున్న మంచి గుణములను, మంచి భావములను, మంచి ఆదర్శమును, తెలివి తేటలను అభినందించే సంస్కారిక లక్షణము రెండవది. ఎదుటి వాని యొక్క మంచి గుణములను, ఎదుటి వాని యొక్క మంచి లక్షణములను, ఎదుటి వాని యొక్క తెలివి తేటలను, ఆదర్శమును మనము గుర్తించవలసినది ప్రధానమైనది. ఇట్టివారు లోకములో చాలా అరుదు.

ఐతే యిట్టి పవిత్రమైన ఆదర్శములను గుర్తించి, తాము అనుభవించి అన్యులకు అందించి, ఆనందమును పంచుకొని పెంచుకున్నవాడే జీసస్. రెండువేల

125128803

సంవత్సరములకు పూర్వము పాలస్తీన్ అనే రాజ్యము లోపల నజరత్ అనే గ్రామములో మేరి జోసెఫ్ లు జీవించుచూ వుండేవారు. అది శిలా కాలము, రోమన్ చక్రవర్తి ఆజ్ఞానుసారంగా ప్రతి మానవుడు కూడను తనయొక్క పేరును జనాభా లెక్కలలో చేర్చుకోవాలని ఆదేశము. ఈ విధముగా జనాభాలో తన యొక్క పేరును చేర్చుటనే నిమిత్తమై అనేక గ్రామములనుంచి బెతలేహేము అనే పట్టణమునకు ప్రయాణమై వెళ్ళారు. ఆ సమయములోపల మేరీ జోసెఫ్‌లు కూడను వెళ్ళవలసి వచ్చింది. అప్పుడు మేరీకి నవమాసములు. ఆమెకు నడక కష్టముగా వుంటుందని భావించి జోసెఫ్ ఒక గాడిదను యేర్పాటు చేసి దానిపై ఆమెను కూర్చోబెట్టి ప్రయాణము సలుపుతూ వచ్చాడు. ఈ బెతలేహేమ్ పట్టణానికి చేరేటప్పటికి సాయంకాలమైంది. అప్పటికే అనేక గ్రామములనుండి వచ్చిన ప్రజలు యే సత్రము కూడా ఖాళీ లేక, ఏ ప్రదేశమునందు ఒక్క మానవుడు నివసించటానికి కూడను వీలులేని స్థితిలో కిటకిట లాడుతుండాది. సత్రము యజమాని అలసిపోయిన మేరీని చూచాడు. కానీ ఒక పశువుల కొట్టములో వారికి అనుకూలమైన రీతిగా తాను యేర్పరచి యీరాత్రి యిక్కడ నిలమని చెప్పాడు. అది 24వ తేదీ డిసెంబరు రాత్రి. తెల్లవారితే 25వ తేదీ. పన్నెండుకు ఒకటికి మధ్యలోపల మేరీ ఒక శిశువును ప్రసవించింది. బిడ్డను వుంచుటకు పదార్థములు గానీ, బట్టలు గానీ లేక పోయినవి. ఆ పశువుల కొట్టము లోపల పశువులకు తిండి పెట్టే ఒక బుట్ట వున్నది. ఆ బుట్టలో మెత్తని గడ్డివేసి దానిపైన ఒక బట్టను పరచి ఆ బిడ్డను వుంచింది. ఒకటి రెండు దినముల లోపల యీ జనాభా లెక్కలలో తమ పేర్లు ఎక్కించి అక్కడనుండి తిరిగి నజరత్ గ్రామానికి చేరుకున్నారు.

ఆ పిల్లవానిని మేరీ చాలా ప్రేమతో పెంచుతూ వచ్చింది. మేరీ చాలా భగవంతుని భక్తురాలు. చిన్నప్పటినుండి భగవంతుని కథలు చెప్పటము, దయ ప్రేమ, త్యాగము ఇత్యాది సద్గుణములను బోధిస్తూ వచ్చింది. దిన దిన ప్రవర్ధమానుడై యీ బాలుడు పెరుగుతూ వచ్చాడు. పన్నెండు సంవత్సరములయ్యేటప్పటికి యూదులకు ఒక ప్రత్యేకమైన పండుగ వచ్చింది. జెరూసెలం లోపల గొప్ప వుత్సవాలు జరుగుతూ వచ్చాయి. దానిని దర్శించే నిమిత్తమై మేరీ, జోసెఫ్ యీ జీసస్‌ని తీసుకొని జెరూసెలం పోయారు. వేలాది ప్రజలు చేరి దారి నడచుటకు కూడను వీలుగాని జనములో కిక్కిరిసి వున్నది జెరూసెలం. ఈ వింతలను, వినోదములను పరికించుచూ యీ మేరీ జోసెఫ్‌లు జీసస్‌ను మరచినారు కొంతసేపు. ఈ లోపల చూసుకుంటే జీసస్ అక్కడ కనుపించ లేదు. మేరీ జోసెఫ్‌లు ప్రతి వీధి కూడను ఒక్కొక్క వ్యక్తిని పరికిస్తూ వెతుకుతూ వచ్చారు. చాలా బాధపడ్డారు. బిడ్డను కనుపించక తపించారు. కడపటికి నిరాశ చెంది జెరూసెలంలో మందిరము లోపల ప్రవేశించి చూద్దామని లోపలకు వెళ్ళారు. అక్కడ తమ గురువు వుపదేశిస్తున్న వుపదేశములో

125128804

ముందు కూర్చొని శ్రద్ధతో వింటున్నాడు జోసస్. బిడ్డను చూచేటప్పటికి ఆనందముతో
బాటు దుఃఖము కూడను కలిగింది. బిడ్డను కరచుకొని 'నాయనా ఎంత కష్టపెడితివి
ఎందుకు చెప్పలేదు. నీకోసమై నేను అనేక విధముల కూడను తిరిగి చాలా బాధ పడు
తున్నాను'. మొట్టమొదటి పదము జోసస్ చెప్పినది యిదియే. 'అమ్మా! ఏమిటి
నీ పిచ్చి. నాతండ్రియైన దేవుని దగ్గర నేనుంటే నా నిమిత్తమై నీవు భయపడటం ఎందుకు
నాతండ్రి దగ్గర వున్నాను గాని పరాయి చోట లేను కదా'. దీనిని బట్టి చూడగా జోసస్ కు
ఒక తండ్రి అనే భగవంతుడు వున్నాడు. తండ్రి కుమారుడు తాను అనే విషయము
స్పష్టము చేశాడు. సరే ఆ వుత్సవము చూచుకున్నారు. నజరత్ గ్రామమునకు తిరిగి
వెళ్లారు. అప్పటినుండి జోసస్ తన తండ్రికి కట్టెపనిలో కొంత సహాయము చేస్తూవచ్చి
డు. ఈ విధముగా చేస్తూ చేస్తూ రాగా తల్లి బోధనలు తన హృదయమున నాటుకొని
పోగా ముప్పై సంవత్సరముల వరకు పెరిగాడు. తండ్రి మరణించగానే తల్లిని కొంతప
టిచి అనేక విధములుగా వేదాంతమును ఆమెకు బోధించాడు. తల్లిని ఓదార్చటమే
కాక, తాను తల్లి దగ్గరనుండి అనుమతిని కోరాడు. 'అమ్మా! భగవంతుడు మానవ దేహ
మును యిచ్చినది కేవలము మానవులకు సేవ చేసే నిమిత్తము. దీనులను, దిక్కులేని
పేదతులైన మానవులను కొంతవరకు రక్షించి వారికి తగిన ధైర్య సాహసములను అందిం
చాలి. అట్టి సేవలో నేను పాల్గొనే అనుమతిని యివ్వమని కోరాడు. తల్లి అనుమతి యి
వ్వక తప్పలేదు. నిర్బంధముతో అనుమతి యిచ్చింది.

అక్కడనుండి బయలుదేరాడు. జోర్డాన్ లోపల స్నానము చేశాడు.
యోహాను అనే గురువు దగ్గరకు పోయి దీక్షను బూనాడు, దట్టమైన అరణ్యములో ప్రవేశిం
చాడు. నలభై దినములు కఠినమైన దీక్షలో తాను భగవంతుని ప్రార్థించాడు. మూడు
విధములైన ప్రార్థనలు తాను సల్పాడు. ఒకటి సర్వులను ప్రేమించే సమత్వము తనకు
ప్రసాదించమన్నాడు. ఎవరేమన్నను, ఎవరు ఎంత బాధించినప్పటికి నేను దానిని స
హించే, భరించే శక్తి సామర్థ్యములను అనుగ్రహించమన్నాడు. మూడవది నీవు అను
గ్రహించిన యీ దేహాన్ని నీ నిమిత్తమై అర్పితము గావించుటకు నాకు ప్రసాదించమ
న్నాడు. నలభై దినములు గడచిన తరువాత దీక్షను పూర్తిగావించుకొని నాకు భగ
వంతుడు యీ శక్తిని అందించాడనే విశ్వాసముతో తాను బయటకు వెళ్లాడు.
కోబర్ హేం అనే గ్రామము చేరుకున్నాడు. దానికి సమీపములోనే వుంటున్నాది వెళ్లై
అనే నదీతీరము. ఆ తీరము దగ్గరకు వచ్చేటప్పటికి అనేకమంది బెస్తలంతా నిరాశతో
నిస్పృహతో చాలా విచారగ్రస్తులై వుండటం చూచాడు. దుఃఖితులైన వారిని చూచిన
ప్పుడు వారిని విచారించటము, దుఃఖమునకు కారణము యేమిటో తెలుసుకోటము
దాని నివారణగావించటము తనయొక్క ప్రధాన కర్తవ్యముగా గుర్తించుకున్నాడు.
అప్పుడు తమకు సంభవించిన విషాదము విన్నవించుకున్నారు జోసస్ దగ్గర. రెండు

దినముల నుండి మేము యింత ప్రయత్నించినప్పటికి ఒక్క చేపైనా మాకు లభించ లేదని మొరపెట్టుకున్నారు. అందులో ప్రధానమైన శిష్యుడు పేటరును దగ్గరకు అగాడు పడవ సిద్ధము చేయి మనము నదిలో ప్రయాణము చేద్దాము. దానిలో చేరి కొంత దూరము బయలుదేరి 'యీ స్థలములో మీరు వల వేయండి కావలసినన్ని మీకు లభిస్తాయి' అన్నాడు, వారు జీవితములో యేనాడు కూడను కని విని యెరుగని అన్ని చేపలు వారికి లభించాయి. ఆ శిష్యవారు అమితానందము చేత జీసస్ ను కౌగలించుకొని మనుష్యుల యొక్క మర్మము కాదు చేపల యొక్క నది యొక్క మర్మములను గుర్తించుకున్న వాడవు నీవు అని ప్రశ్నించారు. అప్పుడు తాను వారికి చెప్పిన జవాబు 'నేను ప్రేమ రాజ్యాన్ని స్థాపించాలని సంకల్పించు కున్నాను. ఇది మా తండ్రి యొక్క ఆజ్ఞ. దీనికి ప్రధానమైన స్థంభములుగా మీరు నిల్వాలి' అని ఆనాటి నుండి యీ శిష్య వారలకు అనేక విధములైన వేదాంత బోధలు సలుపుతూ వచ్చాడు.

మానవ జీవితము చాలా పవిత్రమైనది. చాలా విలువైనది. మనము కాపాడుకో తగినది. ఇందులోనే భగవంతుని మనము గాంచవలసినది. ఇటువంటి దివ్యమైన మానవత్వమును వ్యర్థము గావించుకోటం సరియైనది కాదని ఆ శిష్య వారలకు బోధిస్తూ వచ్చాడు. ఒక ఉదాహరణము చెప్పాడు. నదిలో చాలా తీవ్రమైన జలము చేత ప్రవాహము జరుగుతూ వుండి. ఆ జలములో చిన్న చిన్న చేపలు కూడను పైన తేలుతూ ఆడుతూ ఆనందముగా జీవితము గడపుతూ వుంటాయి. అదే జలములో గొప్ప శరీరము కలిగిన ఏనుగును విడచినప్పుడు ఆ ఏనుగు నీటిలో మునిగి ప్రాణము కోల్పోతుంది. చిన్న ఆకారము కలిగిన చేప యింత వేగముతో వున్న జలములో తాను ఆడుతూ పాడుతూ ఆనందముగా తన జీవితమును సంరక్షించుకుంటూ వచ్చింది. ఇంత పెద్ద శరీరము కలిగినప్పటికీ యీ ఏనుగు జలము లోపల ప్రాణమును నిలుపుకోలేక పోయింది. దీనికి కారణం యేమిటి? జలములో వుండిన దానికి యీత అత్యవసరము గాని ఆకారము అవసరము కాదు. అదే విధముగనే మానవ జీవితము కేవలము పాండిత్యముగానీ వేదాంతముగాని, వైరాగ్యముగాని ప్రధానము కాదు. సంసార సాగరములో వుండిన మానవునకు దీనిని సంరక్షించుకునే దైవము యొక్క ప్రేమ అనే యీతను మనము సాధించాలి. ఏ వేదాంతము తెలియనప్పటికిని భగవత్ప్రేమ ఒక్కటి వుంటే యీ జగత్తనే సంసార సాగరమందు మనము సుక్షేమముగా జీవించగలము. భగవద్విశ్వాసము లేనివాడు ఎంతటి గొప్ప పండితుడైనప్పటికి, గొప్ప పేరు సంపాయించినప్పటికీ యిది బాహ్యమైన ఆడంబరములే గాని యిందులో ఆనందాన్ని తాను అనుభవించలేడు.

దేహము నీటి బుడగ వంటిది. దీనిని ఆధారము చేసుకుని మనము జీవించటము అజ్ఞానమే. కావున మనము దేనికోసం జీవించాలంటే ఆ దేహాన్ని ధరించే నిమిత్తమై యీ దేహమును పోషించుకోవాలి. కనుక దేహ సంరక్షణ అనేది దేహమైన లక్ష్యము నుంచు

125128806

కాని దేహ సంరక్షణా గావించుకోవాలి గాని దేహాన్ని మరచి దేహసంరక్షణా మనేది పూర్ణ అజ్ఞాన
మని బోధించాడు. చక్కెర చిన్న పరమాణువుగా వుంటుంది. ఈ అణువు యిసుకలో
జల్లినప్పుడు యింతటి మేధాశక్తివంతుడైనప్పటికిని దానిని ప్రత్యేకముగా విభజించి
యిసుకను వేరు చక్కెరను వేరు చేయుటకు ప్రయత్నించినప్పటికి విఫలుడై పోతాడు
కానీ యిట్టి మేధాశక్తి లేక పోయినప్పటికి చిన్న చీమ ఆ యిసుకలో ప్రవేశించి యిసుక
ను వేరు చేసి చక్కెరను మాత్రమే స్వీకరించి ఆనందముగా అనుభవిస్తుంది. ఈ చీమ
చక్కెర రుచి ఎరిగినది కనుక ఆ చక్కెరను స్వీకరించి యిసుకు వేరు చేస్తూ వచ్చింది.
అట్టులనే నిత్యానిత్య విషయ పరిశీలన శక్తి లేని మానవుడు యీ పవిత్రమైన మార్గము
లో ప్రవేశించ లేడు. కనుక ప్రతి మానవుడు యేది నిత్యము, యేది అనిత్యము అనేది
మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. ఈ నిత్యానిత్య విషయ పరిశీలనే మానవుని
ప్రధానమైన క్రియ. అటువంటి పవిత్రమైన శక్తి కలిగి కూడను మానవుడు యీ విచార
ణా శక్తిలో ప్రవేశించక కేవలము ఒకవిధమైన అమాయకత్వము లోపల భౌతికము
నే ఆశించి తన జీవితమును వ్యర్థము చేసుకొను చున్నాడు.

ఈ దేహము దేహ నిమిత్తమై యేర్పడినదిగాని కేవలము దేహ నిమిత్తమై
యేర్పడినది కాదు. సత్యమునకు మనము వెరచవలెను గాని, అసత్యమునకు గాని, అధ
ర్మమునకు గాని యేమాత్రము వెరచరాదు. సత్యాన్ని మనము పాటించాలి. ధర్మాన్ని మన
ము ఆచరించాలి. ధైర్యముతో యీ దుఃఖమును ఎదుర్కోవాలి. మన విరోధులను కూ
డా ప్రేమించాలి. కనుక ఈ సర్వధర్మమనే తత్వము లోపల సర్వసమానమైన ప్రేమనే
ప్రధానమని బోధించాడు. ప్రేమ లేక జీవితము లేదు. ప్రేమయే పరమాత్ముడు. ఇట్టి
పరమాత్ముడు ప్రేమస్వరూపములో మన ఎదుట వుండినప్పటికి అట్టి పరమ సత్యాన్ని
గుర్తించుకోలేక కేవలము ద్వేషము, అసూయ యిలాంటి దుర్గుణముల లోపల యీ
ప్రేమను ప్రవేశపెడు తున్నాము. బిడ్డలారా కేవలము స్వార్థము, స్వప్రయోజనము
నిమిత్తమై యేర్పడినది కాదు యీ ప్రేమ. ఈ ప్రేమ పరమాత్ముని నుండి వచ్చినదో ఆ
పరమాత్ముని ప్రేమించే నిమిత్తమై ప్రేమ నందించాలి. అంతే కాని యీ ప్రేమను స్వార్థప్ర
ప్రయోజన నిమిత్తమై ప్రవేశపెట్టుటము యిది మహా దుర్మార్గమని కూడను బోధిం
చాడు. మనకు వుపకారము చేసిన వానికే వుపకారము చేయుటము గొప్పతనము
కాదు. అపకారము చేసిన వారికి కూడను వుపకారము చేయాలని బోధించాడు

ఉపకారికి నుపకారము
విపరీతము గాదు చేయ వివరింపంగా
అపకారికి నుపకారము
నెపమెన్నక చేయువాడె నేర్పరి సుమతీ.

అన్నారు. కనుక ఎవ్వరిని ద్వేషించటానికి పూనుకో కూడదు. ఇవన్నియు కూడను అన్నిగ్రం

ధములందు, అన్ని మతములందు వుండిన సమత్వము ఒక్కటే. భగవద్గీతలో కూడను అద్వేష్టా సర్వ భూతానాం అందరిని మిత్రులుగా చూచుకోవాలి. శత్రువులతో కూడను మిత్రత్వము అభివృద్ధి చేసుకోవాలి. ఈ విధమైన బోధ నిత్యము తెల్లవారి సాయంకాలము వరకు బెస్తవారికి చేస్తూ వచ్చాడు. వీరు యీ విధమైన బోధలు అనుసరిస్తూ జీసస్ పైన అమితమైన నమ్మకమును పెంచుకుంటూ అతన్ని ప్రేమిస్తూ కాలము గడపుతూ వారికి కావలసినంత చేపలను అభివృద్ధిగావించుకుంటూ వారి యొక్క జీవితమును ఆనందముగా గడపుతూ వచ్చారు

ఈ విధముగా బెస్తవారలకు అమితమైన చేపలు లభించటి ఎక్కువ సంపాదన చేస్తున్నారు అనే విషయమును గుర్తించుకొని tax collector Mathew అక్కడకు వచ్చాడు. ఈ tax collector ను చూచేటప్పటికి బెస్తవారు పరుగెత్తి పోతూ వచ్చారు. వారికి ధైర్యమును బోధించాడు. సత్యాన్ని చెప్పి tax మనం కట్టలిగాని దీనికి వెరచి మనము పరుగెత్తటము యిది కేవలము బలహీనత అని వారికి బోధించాడు. ఈ విధముగా వారిని గట్టిగా నిలిపేటప్పటికి యీ Mathew అక్కడకు వచ్చి యీ జీసస్ బోధలనంతా తాను అర్థము చేసుకొని అతనికి నమస్కరించి తాను కూడను యీ బెస్తవారితో ఒక భక్తుడుగా మారిపోయాడు. దినదినమునకు జీసస్ యొక్క ప్రభావము చాలా పెరుగుతూ వచ్చింది. ఇవి అన్ని దేశములందు, అన్ని విషయములందు కూడను కొంతమంది అసూయా పరులు అభివృద్ధి అవుతూ వుంటారు. కొంతమంది పెద్దాధిపతులు యితని ప్రభావము పెరగటం చూచి వారికి అసూయ పెరిగి పోయింది. ఇది అన్ని దేశములందు వుండిన తీరని రోగమే. దీనిపైన ఆధారము చేసుకొని రాజద్రోహిగా అనేక రకములుగా అతనిని హింసించటానికి ప్రయత్నించారు. ఎన్ని విధములుగా అతనిని హింసించినప్పటికిని అతను సత్యమార్గమును తప్పక, ధర్మమార్గమును వీడక ప్రేమ మార్గమునందే తన జీవితము అంకితము చేశాడు. తాను భగవంతుడు పంపించిన దూతగా తాను విశ్వసించాడు. I am the messenger of God అనేది బహిరంగముగా కూడను తాను తెలుపుతూ వచ్చాడు. నేనొక్కడనే కాదు. వీరందరు భగవంతుని సందేశకర్తలు అని చెప్పాడు

ప్రతి మానవుడు యీ ఆకారము ధరించి యీ లోకానికి రావటానికి కేవలము భగవంతుని దూతలుగానే విశ్వసించాలి. ఏదో ఒక కారణము లేకుండా యీ కార్యము జరుగదు. ఈ కారణము ఆ కర్తకు మాత్రమే తెలుసుగాని యితరులకు అర్థం కాదు. ఒక్కొక్క మానవుడు ఒక్కొక్క ఆదర్శవంతమైన జీవితమును అందించటానికి ప్రయత్నించాలి. కనుక ప్రతి మానవుడు నేను భగవంతుని యొక్క దూతననే విశ్వాసము చేత యీ ఆదర్శవంతాన్ని లోకానికి అందించటానికి ప్రయత్నించాలి. ఎప్పుడు నేను దూతను అనే విశ్వాసమును తాను అభివృద్ధి పరచుకున్నప్పుడు

125128808

స్వార్థమును, స్వప్రయోజనమును త్యజించాలి. అప్పుడే తాను ఆదర్శాన్ని అందించటానికి అర్హుడౌతాడు. ఇది అంత సులభము కాదు. అయినప్పటికిని భగవంతుని అనుగ్రహము చేత ఎంత వరకూనైనా సాధించటానికి వీలవుతుంది. క్రమక్రమేణా ఈ భావములో జీవితాన్ని గడుపుతూ గడుపుతూ సత్యాన్ని కొంతవరకు realise చేస్తూ వచ్చాడు, గుర్తించుతూ వచ్చాడు నేను కేవలం ఒక మెసెంజరు మాత్రమే కాదు భగవంతునికి సన్నిహిత సంబంధుడను అనే భావము చేత I am the son of God అన్నాడు. అనగా దైవత్వమునకు అతిసమీపముగా పోతూ వచ్చాడు

లోకములో అవతారములు ఐదు విధములుగా వుంటున్నాయి. నిత్యావతారము. అనగా ఒక సామాన్య మానవత్వములో మనము జీవించి నిత్య జీవితములో మన కర్తవ్యమును గుర్తించి ఆదర్శవంతమైన జీవితాన్ని అందించి ప్రేమను పెంచి పదిమందికి పంచేది నిత్యావతారము. విశేషావతారమని రెండవది. అనగా కేవలము అప్పటికప్పుడు మాత్రమే ప్రత్యక్షమై ఆ కార్యమును పూర్తిగావించి ప్రజలను ఆనందపరచి ఆ కష్టమును నివారణ గావించటము యిది విశేషావతారము. అవిశేషావతారమని మూడవది. అనగా అంశములతో కూడి కేవలము మానవత్వమనే దానిని ఆధారము చేసుకొని దేవత్వమును లక్ష్యమునందుంచుకొని పారమార్థిక దృష్టితో ప్రాపంచిక జీవితాన్ని గడపటము. నాల్గవది అంశావతారము. అనగా కొన్ని దైవశక్తులతో కూడి దైవదృష్టిలో కూడి సామాన్యమైన మానవులకు తోటి మానవులకు తగిన ధైర్యమును సాహసమును అందించటము. ఐదవది పూర్ణావతారమని. సమస్త శక్తులతో కూడి, సమస్త సృష్టిలో చేరి పూర్ణమైన ప్రేమతో మానవత్వమును ఏకత్వము గావించటానికి ప్రయత్నము చేయటము. ఇదే ప్రేమరాజ్యమునకు పునాదులు

కనుక క్రమక్రమేణా యితను అంశావతారము సంభావించి తాను కొంత వరకు అంశావతారములోనే అంత్యమవుతూ వచ్చాడు జీసస్. I and my father are one అన్నాడేగాని Father అనేది వదలలేదు. ఒకటి నిజమే కాని నేను, father ద్వైతములో జీవిస్తూ వచ్చాడు. తనను శిలువకు కొట్టినప్పుడు కట్టకడపటికి తన శ్వాసము వెళ్ళేవరకు కూడను చెప్పిన పదము ఒక్కటే Father, Father have you forgotten me have you forgotten me, have you forgotten me అన్నాడు ప్రాణం విడిచాడు. అనగా అంత్యములో కూడను Father అనే భావము తనలో మరింప చేసుకున్నాడు. కనుక పూర్ణావతారమునకు దీనికి వుండిన వ్యత్యాసము. జీసస్ జగత్తుకు ప్రేమ తత్వము, కరుణా భావము వెదజల్లుతూ వచ్చాడు. కాని దురదృష్టవశాత్తూ జీసస్ పోయిన తరువాత అతని పేరు 350 సంవత్సరములు ఎవ్వరూ వుచ్చరించలేదు. అతని విషయములో అనేక విధములైన వాదోపవాదములు కూడను జరుపుతూ వచ్చారు. ఇది కేవలము అజ్ఞానులకుండే పరమ మూర్ఖత్వము మాత్రమే.

125128809

ఇట్టి సత్యాన్ని గుర్తించుకోలేని వారు యిలాంటి అంధకారములో ప్రవేశిస్తూ వుంటారు. ఇలాంటి వారు యెన్ని చూపినా, యెన్ని చేసినా, ఏది వారికి అందించినా వారికి అర్థము కాదు

నగలు పెట్టిన కోతికి సొగసు రాదు
కన్ను విప్పిన అంధుడు కనగ లేడు
భక్తి కలుగదు మూర్ఖునకు యుక్తి చేత

ఈ మూర్ఖులకు భక్తి కలగాలంటె ఏవిధముగా వస్తుంది. అది కేవలము ఒక యుక్తితో చూస్తారు. యుక్తి చేత భగవంతుని యొక్క భక్తికారికి యెమాత్రము కూడను అలవరించదు. కాన ప్రేమ చేతనే భక్తి, ముక్తి, యింక్తులు కూడను సాధించ వచ్చును, భగవంతుని ప్రేమించుటము. ఈ ప్రేమ తత్వమే మానవునకు రాచ మార్గము. అందరియందు దైవత్వముందనే సత్యాన్ని మనము అర్థము చేసుకోవాలి. ఈ ప్రేమచేతనే ఏకమత్వము సంభవిస్తుంది.

ఒక చిన్న ఉదాహరణము. ఈనాడు యిక్కడ అనేక దేశముల వారంతా చేరారు. భాషలో భేదము. సంస్కారములలో భేదము. సిద్ధాంతములలో భేదము వాంఛలలో భేదము. ఎన్ని భేదములు వుండినప్పటికి అన్ని భేదములు విస్మరించి సాయిప్రేమ తత్వమును విశ్వసించి ఒక ఏకత్వముగా అన్న తమ్ములు, అక్కచెల్లెండ్ర వలె జీవిస్తూ వస్తున్నారు. ఈ అందరూ యింత ఏకమత్యముగా కూడి ఆనందాన్ని అనుభవించటానికి ఆనందమే కారణము గాని అన్యము కాదు. ఈ ప్రేమ లేని చోటే ద్వేషము ప్రారంభమవుతుంది. ప్రేమ నమ్మకము చేతనే యేర్పడుతుంది. ఈ ప్రేమ చేత మనకు శాంతి లభిస్తుంది. ఈ శాంతి చేతనే మనము సత్య మార్గములో ప్రవేశిస్తాము. ఈ సత్యమార్గములోనే మనకు ఆనందము లభిస్తుంది. ఈ ఆనందమే దైవస్వరూపకముగా మారిపోతుంది. కనుక

Where there is confidence there is Love
Where there is Love there is Peace
Where there is Peace there is Truth
Where there is Truth there is Bliss
Where there is Bliss there is GOD.

కనుక నమ్మకమును మనము అభివృద్ధి పరచుకోవాలి. ఈ నమ్మకమే లేకపోతే అంధుడుగా మారిపోతాడు. పిచ్చి పిచ్చి విషయాలపైన కూడను వీరికి నమ్మకము అభివృద్ధి అవుతుంది. కానీ సత్యముపైన పవిత్రమైన దానిని నమ్మకము కుదరటం అది ఒక ప్రాప్తి కూడా వుండాలి.

దైవము అనేక రూపములలో వుంటున్నాడు. అది వేదాంత పరిభాషలో సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్ర పాత్ అనగా సర్వరూపములు భగవంతునివే.

భగవంతుని అనేక రూపములలో ఆరాధన చేయుటము కేవలము ఆనంద నిమిత్తమే. రోమన్ దేశములో కూడను భారతీయులు విశ్వసించినట్లే అనేక దేవతలనంతా విశ్వసిస్తూ వచ్చిరు పూర్వము. దాని తరువాత క్రిష్టియన్ మతము ప్రారంభమైంది. మొట్టమొదట ఏకత్వమనేది లేదు. అనేకత్వము లో నుండి ఏకత్వము లోకి ప్రారంభమైంది. మొదట సోక్రటీసు వుండేవాడు. అతని ప్రధానమైన శిష్యుడుగా ప్లేటో ఒకడు వచ్చాడు. ఈ ప్లేటో మాత్రమే ప్రధానమైన తత్వాన్ని జగత్తుకు వ్యాప్తి చేస్తూ వచ్చాడు. ఈ ప్లేటో శిష్యునిగా అరిస్టోటిల్ బయలు దేరాడు. ఈ అరిస్టాటిల్ శిష్యుడే అలగ్జాండరుగా వచ్చాడు. కనుక యివన్నీ సాంప్రదాయకముగా వచ్చినటువంటివే. కాని అనేకత్వములో వుండిన దివ్యత్వమును బోధించిన వాడు ప్లేటో.

కనుక అన్ని దేశములందు సత్యము ఒక్కటే. దేశములు వేరైనప్పటికి సత్యములు మారటానికి వీలుకాదు. కనుకనే Truth is God అని సత్యాన్ని మనము అనుసరించాలి. ఈ సత్యము మనయందే వుంటున్నది. అదే వేదాంత పరిభాషయందు సత్ చిత్ ఆనంద మన్నారు. ప్రపంచములోని ప్రతి పదార్థమునందు అస్తి భాతి ప్రియం యీ మూడూ వుంటున్నవి. పదార్థములు ఎన్ని మారినప్పటికి సత్ వస్తువు అనేది ఒక్కటే. అదే వున్నది. సత్ అనగా being. ఐతే దానికి ఒక విధమైన ప్రకాశాన్ని చేకూరుస్తూ వచ్చినది చిత్. ఇది ఒక టంబ్లరు, ఈ టంబ్లరు వున్నది. ఐతే వున్నదని యేరీతిగా కనుపిస్తున్నది కాబట్టి వున్నదని చెప్పుతున్నాము. కనుపింప చేయటమే చిత్. దీనిని ఆనందముగా అనుభవించటమే ఆనందము. ఈనాడిది టంబ్లరుగా వుండవచ్చును, మనము దీనిని చెదరగొట్టి ప్లేటుగా తయారు చేసుకోవచ్చు. టంబ్లరు మారింది గాని వెండి మారలేదు. ఆ ప్లేటు మరి కొంత కాలమునకు స్పూనుగా మార్చుకొన వచ్చును. ప్లేటు రూపము మారింది గాని వెండి మారలేదు. టంబ్లరునందు, ప్లేటునందు, స్పూనునందు వుండిన ఆకారము మార్చవచ్చినది గాని పదార్థము యొక్క తత్వము ఒక్కటిగానే వుంటుంది. అదే విధముగా మానవత్వములో వున్న రూపనామములు మారవచ్చును గాని సత్ చిత్ ఆనందము మారేది కాదు. అదే శాశ్వతమైనది.

ప్రేమ స్వరూపులారా! మానవ జాతికి మధ్యనున్న భేదమనే గోడను మనము కొట్టి వెయ్యాలి. ఈ దట్టమైన కులమతములనే walls ను మనము దూరము చెయ్యాలి. అందరూ ఒక్కటే అనే యేకత్వమును మనము విశ్వసించాలి. ప్రేమతత్వాన్ని మనము పెంచాలి. అప్పుడే దేశమంతా కూడను ఒక్కటిగానూ ఆనందముగానూ కళకళలాడుతుంది. చూడండి ఎన్నో సంవత్సరముల నుండి బెతల్‌హామ్ లోపల జీసస్ Xmas నాడు చాలా వైభవముగా జరుపుకొనేవారు. ప్రధానమైన పట్టణమది. జీసస్ పుట్టిన స్థానమది. ఈ స్థానము లోపల, యీనాడు మానవునిలో వున్న దుర్గుణములు, దురాలోచనలు, స్వార్థము, స్వప్రయోజనము చేత యీనాడు ఆ బెతల్‌హామ్ లో

125128811

Xmas జరుపుకోకుండా నిలిపి వేశారు. ప్రపంచమంతా జరుగుతున్నదిగానీ యీనాడు బెతలహేమ్ లోపల యీనాడు Xmas పండుగ జరుపలేదు. దీనికి కారణము యేమిటి? మానవునిలో వుండిన స్వార్థమనే దుర్గుణమే. భగవంతుడు అందరియందు వున్నాడు. అందరివాడు. కేవలము వ్యక్తి స్వరూపుడు సమిష్టి స్వరూపుడు. అందరికి అధికారము వుంటున్నది. ఇలాంటి ఏకత్వమును భావించటమే దైవత్వము అనే పదమునకు అర్థము. ఈనాడు మనము దేశము లోపల ఐకమత్యమును పెంచాలి.

ఐకమత్యమే మానవుని ప్రధాన లక్ష్యము. ఈ ఐకమత్యమే వుండినప్పుడు యీ భేదములు అడుగంటి పోతాయి. భేదములు అడుగంటి పోయినప్పుడే ఆనందము ఆవిర్భవిస్తుంది. ఆనందమే మన జీవిత గమ్యము. కనుక మీరందరు కూడను వ్యక్తిగత భేదములకుగాని, ప్రాంతీయ భేదములకు గాని, దేశ భేదమునకు గాని అవకాశము యివ్వక అందరు దైవము యొక్క బిడ్డలమనే భావాన్ని పెంచుకోవాలి. ఏరూపమైనా పూజించండి గాని అంతా ఒకటే అనే సత్యాన్ని గుర్తించండి. ఇలాంటి ప్రేమతత్వాన్ని పెంచుకోటమే యిలాంటి పర్వదినము యొక్క అంతరార్థము. జీసస్ పుట్టిన దినము కేవలము తినటము, త్రాగటము, ఆడుకోటం, పాడుకోటం యిది మాత్రమే కాదు. ప్రధానమైన కర్తవ్యము. జీసస్ ఆదర్శముగా నిరూపించిన విషయములను మనము ఆచరణలో పెట్టాలి. అది నిజమైన Birthday కి సరైన గుర్తు. అతని పుట్టిన పండుగ చేసుకోటము, అతని ఆదర్శములను పూడ్చిపెట్టటమా యిది భక్తుల సరైన లక్షణము కాదు. ఎవరిని మనము విశ్వసించినామో ఆవిశ్వసించిన వ్యక్తి యొక్క ఆదర్శ జీవితములో ఆచరించటానికి ప్రయత్నించాలి. చెప్పిన మాటను ఆచరించకుండా భక్తి భక్తి అంటే యేమి భక్తి యిది. కేవలము భూటకపు భక్తి. ఇలాంటి దానిని భక్తి అని చెప్పటానికి వీలుకాదు. ఇది స్వార్థ పరమైన దుర్గుణమనే చెప్పవచ్చు. అన్ని చేయకపోయినా ఏదొకటి రెండైనా ఆచరణలో పెట్టాలి. నేను రామ భక్తుడను, నేను కృష్ణ భక్తుడను, నేను సాయి భక్తుడను, నేను జీసస్ భక్తుడను అని చెప్పుకోటం సులభమే కాని చెప్పే దానికంటె ఆచరించి ఆచరణములు చేరటానికి ప్రయత్నించాలి. వాడే నిజమైన భక్తుడు. ఆచరణ లేకుండా కేవలము వాక్కుతో వుచ్ఛరించిన మాత్రమున యిది ఆనందము లభించదు.

పుట్టపై మర్దించిన పాము మరణమొందునా
తనువును తా దండించిన విషయ భోగమడగునా
ఆకలిదప్పులు వీడినంత ఆత్మజ్ఞాని తానగునా
తానెవరో తెలియకున్న తత్వజ్ఞానమెటుకుదురు.

అన్నారు. who am I అనే సత్యాన్ని గుర్తించటానికి మనము ప్రయత్నించాలి. నిరంతరము who are you, who are you అని ప్రశ్న వేస్తున్నామే గాని who am I

125128812

అని ప్రశ్నించుకోటం మరచిపోతున్నాడు మానవుడు. తనను తాను తెలుసుకోకుండా ఎవరెవరినో తెలుసుకుంటె వచ్చిన ఫలితమేమిటి? తనను తాను తెలుసుకున్నవాడు సర్వము తెలుసుకున్న వాడౌతాడు. కనుక తాను ప్రేమ స్వరూపుడే. ఈ ప్రేమస్వరూపుడు కనుక సర్వులు ప్రేమ స్వరూపులుగానే విశ్వసించవచ్చు. కనుక ప్రేమతో భగవంతుని స్మరించండి. ప్రేమతో భగవంతుని భజించండి. ప్రేమతో భగవంతుని వరించండి ప్రేమతో జీవితమును తరింప జేసుకోండి.